సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



దేవా.. దీవించవా..

బ్రహ్మంగారిమఠంలో శ్రీ జగద్గురు మది వ్రాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. -6లో..



జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు అరెస్ట్

జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు నింది తులను కడప వన్‌టౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. -6లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.92
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 446 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	502	543
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1018.14 కిలోలు

అంతరిస్తున్న అరుదైన మొక్క

- హార్సిలీహిల్స్‌పై తొలిసారి 1884లో డిప్లోసెంట్రమ్ రికర్వమ్ గుర్తింపు
- తర్వాత అంతర్ధానమై.. 2016లో వెలుగులోకి
- తాజా పరిశోధనలో వెల్లడి



తురాయిచెట్టుపై వికసించిన డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్క

బి.కొత్తకోట: దక్షిణ భారతదేశంలో అరుదైన మొక్కల్లో ఒకటైన డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మళ్లీ అంతరించిపోయే పరిస్థితుల్లో ఉందని మొక్కశాస్త్ర పరిశోధకులు చెబుతున్నారు. 132 ఏళ్ల తర్వాత గుర్తించిన ఈ మొక్క కొన్ని కారణాలతో అంతరించేలా ఉందని తేల్చారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులో ఉంది. చుట్టూ దట్టమైన అడవితో నిండిన హార్సిలీహిల్స్ అరుదైన మొక్కలకు నిలయంగా ఉంది. ఇందులో భాగంగా ఎస్వీయూ మొక్కశాస్త్ర పరిశోధక విద్యార్థులు జరిపిన పరిశోధనల్లో ఈ మొక్క ఉనికిని కనుగొనగా జర్నల్ ఆఫ్ త్రిటెండ్ టాక్సాలో ప్రచురితమైంది.

- 1884లో బ్రిటీష్‌పాలనలో మదనపల్లె అటవీశాఖ అధికారి జేఎస్.గ్యాంబిల్ మొక్కలపై జరిపిన పరిశోధనలో డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్కలు హార్సిలీహిల్స్‌పై ఉన్నట్టు గుర్తించి తన పరిశోధన గ్రంథంలో వివరాలు నమోదు చేశారు. తర్వాత ఈ మొక్క అనవాళ్లు, ఉనికి లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో 2016లో ఎస్వీయూ పరిశోధన విద్యార్థి మిట్టా మహేంద్రనాథ్ పరిశోధనలు మొదలు పెట్టారు. హార్సిలీహిల్స్ అడవిలో పరిశోధించగా అటవీ అతిథిగృహం వద్ద డెలోనిక్స్ రీజియా (పెద్దతురాయి చెట్టు), కృష్ణా టెంపుల్ వద్ద ఫైకస్ మైక్రోకార్పా (కొండ జువ్వి చెట్టు) వృక్షాలపై మొలిచే ఈ మొక్కను గుర్తించారు. 132 ఏళ్ల తర్వాత గుర్తించిన మొక్కలను లెక్కించగా మొత్తం 80 ఉన్నాయి. వాటికి అంకెలు వేసి జియోట్యాగింగ్ చేశారు. ఈ మొక్క జాడ హార్సిలీహిల్స్‌పై ఉందని మిట్టా మహేంద్రనాథ్ పరిశోధించి రాసిన వ్యాసం జర్నల్ ఆఫ్ త్రిటెండ్ టాక్సాలో ప్రచురితమైంది.
- ఎస్వీయూకు చెందిన మొక్కశాస్త్ర పరిశోధకులు మిట్టా మహేంద్రనాథ్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవ చెట్టి పర్యవేక్షణలో పరిశోధనలు సాగిస్తున్నారు. గత ఆదివారం ఇతనితోపాటు మరో పరిశోధకుడు మధుసుధాకర్ వచ్చారు.వారు ఆందోళనకరమైన విషయాలను గుర్తించారు. 2022లో ఒకసారి, గత ఆదివారం మరోసారి 2016లో గుర్తించిన మొక్కలను లెక్కించారు. గుర్తించిన 80 మొక్కలకంటే సంఖ్య పెరగలేదు. దీనికి భిన్నంగా 25కు తగ్గిపోయాయి. దీనికి పలు కారణాలను విశ్లేషించారు. కృష్ణా టెంపుల్ వద్ద ఉన్న ఫైకస్ మైక్రోకార్పా (కొండ జువ్విచెట్టు) కొమ్మలపై డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్కలు ఉన్నాయి. ఈ చెట్ల చుట్టూ ఉన్న చెట్లను నరికివేయడం, చల్లదనం తగ్గడం, ఉష్ణోగ్రతలు అత్యధికంగా పెరిగిన కారణాలతో ఈ మొక్కల సంఖ్య పెరగలేదు.

వాతావరణ మార్పుతో ప్రత్యుత్పత్తి ఆగిపోయింది

డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్కల ప్రత్యుత్పత్తి ఆగిపోయిందని పరిశోధక విద్యార్థులు గుర్తించారు. దీనికి ప్రధానంగా సందర్శకుల సంఖ్య పెరిగడం, పుష్పాలను పాడు చేయడం, గత కొన్నేళ్లుగా కొండపై ఉష్ణోగ్రతలు పెరిగి వాతావరణం వేడెక్కడం, చల్లదనం తగ్గడం లాంటి కారణాలు ఉన్నట్టు నిర్ధారించారు.

▶▶ఇవీ మొక్క విశేషాలు

డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్కకు ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఇది చల్లటి, పర్యావరణ కాలుష్యం లేని ప్రాంతాల్లోనే ఉంటాయి. ఈ మొక్క నేలపైన మొలవదు. ఇతర వృక్షాల కొమ్మలపై మొలుస్తాయి.ఎత్తయిన ప్రదేశాల్లోని వృక్షాల కొమ్మలపై ఉత్పత్తి అయి వికసిస్తాయి. వీటి పుట్టుకకు కారణమైన వృక్షం నుంచే ఆహారాన్ని స్వీకరిస్తాయి. తన వేర్లను చెట్టుకొమ్మల్లో విస్తరిస్తాయి. వీటి పుష్పాలు ఎంతో ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. జూన్–ఆగస్టు మధ్యలో పుష్పాలు వికసిస్తాయి. ప్రస్తుతం అటవీ అతిథిగృహ ప్రవేశం వద్ద డెలోనిక్స్ రీజియా (పెద్ద తురాయి చెట్టు) కొమ్మలపైన, కృష్ణా టెంపుల్ వద్ద ఫైకస్ మైక్రోకార్పా (కొండ జువ్విచెట్టు) కొమ్మలపై మాత్రమే ఈ డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్కలు కనిపిస్తోంది.

టిష్యూకల్చర్ ద్వారా పెంచాలి



తూర్పు కనుమల్లో నెలవైన అడవిజాతులలో అరుదైన మొక్కలతో ఇదొకటి. డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్క అంతరించిపోకుండా టిష్యూకల్చర్ ద్వారా ప్రత్యుత్పత్తి చేయాల్సిన అవసరం ఉంది.

–మిట్టా మహేంద్రనాథ్,
పరిశోధక విద్యార్థి, ఎస్వీయూ

భూమి కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం



స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా

వాల్మీకిపురం: ఎన్‌హెచ్ –71 జాతీయ రహదారి విస్తరణ కోసం భూములు కోల్పోయిన రైతులు నష్టపోకుండా న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ గిరీషా అన్నారు. జాతీయ రహదారి కోసం తమ వద్ద తీసుకున్న భూములకంటే అదనంగా ఎన్‌హెచ్ అధికారులు మార్కింగ్ ఇవ్వడం వల్ల తాము భూములను ఎక్కువ శాతం కోల్పోయామని బాధిత రైతులు గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ మండలంలోని తాటిగుంటపల్లి, మూరేవాండ్లపల్లి, టేకలకోనలో రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి, నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా టేకలకోన గ్రామ రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో సర్వే నంబరు 595, 596, 624లో ఉన్న ఇళ్లు, మసీదు, గుడి జాగాకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న భూముల కంటే అదనంగా ఎన్‌హెచ్ అదికారులు మార్కింగ్ ఇవ్వడం వల్ల తాము ఎక్కువశాతం భూమిని నష్టపోయామని వాపోయారు. దీంతో పరిశీలించి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళి, తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్‌ఐ బాబ్జి, రెవెన్యూ సిబ్బంది, బాధిత రైతులు పాల్గొన్నారు.

రూ. 2400 కోట్లతో సాగు, తాగునీరు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఇందిరమ్మకాలనీలో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి నియోజకవర్గాలకు రూ. 2400 కోట్లతో సాగు, తాగునీరు కల్పించనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పీలేరు మండలంలోని బాలంవారిపల్లె, కంభంమిట్టపల్లె, ఇందిరమ్మకాలనీ, తుమ్మలవారిపల్లె, యర్రగుంటపల్లె, నెట్టిబండ, మేకలవానికాలువ, వినాయక నగర్, బోడుమల్లువారిపల్లెలో ఎంపీ మిథున్‌రెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం అదనపు భవనాలు ప్రారంభించారు. కంభంమిట్టపల్లెలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం గండికోట రిజర్వాయర్ నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో వెనుక బడిన ప్రాంతాలకు శాశ్వత ప్రాతిపదికన పైపులైన్ల ద్వారా తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి కొళాయిల ద్వారా, చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ. 672 కోట్లతో సదుం మండలంలో ఆవులపల్లె రిజర్వాయర్ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98.44 శాతం అమలు చేసినట్లు చెప్పారు.పీలేరు అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి, టీటీడీ బోర్డు డైరెక్టర్ పోకల అశోక్‌కుమార్, మైనారిటీ కమీషన్ ఛైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి,దండు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ బయటపడిన బోగస్ సర్టిఫికెట్స్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో శనివారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ జరిగింది. జోన్–4 పరిధిలోని రాయలసీమ ప్రాంతాల నుంచి అర్హులైన 89 మందికి కౌన్సెలింగ్ చేపట్టారు. ఇందులో భాగంగా వారి దరఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించారు. అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను పరిశీలించే క్రమంలో మరికొన్ని బోగస్ సర్టిఫికెట్స్ బయటపడినట్లు తెలిసింది. జనవరిలో జరిగిన నియామకాల్లో 16 బోగస్ సర్టిఫికెట్స్ బయట పడిన సంగతి తెలిసిందే. తాజాగా మరొకొన్ని బోగస్ సర్టిఫికెట్స్ వెలుగు చూడడం గమనార్హం. దీంతో బోగస్ సర్టిఫికెట్స్ సమర్పించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హజరు కాలేదని సమాచారం. కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన అధికారులు వేరే సమావేశానికి హాజరు కావడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది.

ఇద్దరు అదృశ్యం


ఇషాక్ (ఫైల్)

బి.కొత్తకోట : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. బి.కొత్తకోటలో బాలుడు, మదనపల్లె మండలం సిద్దమ్మగారిపల్లెలో విద్యార్థిని అదృశ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. బి.కొత్తకోటలోని సింహంవీధికి చెందిన షౌకత్ కుమారుడు మహమ్మద్ ఇషాక్ (12) శుక్రవారం సాయంత్రం చెల్లి, అన్నతో కలిసి రంగసముద్రం రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో ట్యూషన్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా సింహంవీధిలోని మిత్రుని ఇంటికి వెళ్లి హోంవర్క్ రాసుకుని వస్తానని ఇషాక్ చెప్పి వెళ్లాడు. తర్వాత ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీనిపై బాలుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ రామమోహన్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ :9440900707కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కళాశాలకు వెళ్లి..


జ్యోతి (ఫైల్)

మదనపల్లె : విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. మదనపల్లె మండలం సిద్దమ్మగారిపల్లెకు చెందిన శంకర కుమార్తె జ్యోతి (20) మదనపల్లెలోని ఓ ప్రవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో శుక్రవారం కళాశాలకు వచ్చిన విద్యార్థిని సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు కళాశాల సిబ్బందిని విచారణ చేశారు. కనపడకపోవడంతో సమీప ప్రాంతాల్లో గాలించారు. అయినా జాడ తెలియకపోవడంతో శనివారం విద్యార్థిని తండ్రి శంకర టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అయితే శంకర కుటుంబ సభ్యులు అదే ప్రాంతానికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేశారు.

బెరైటీస్ అక్రమాలకు పాల్పడ్డ ఉద్యోగులపై చర్యలు

ఓబులవారిపల్లె : బెరైటీస్ ఖనిజం అక్రమ రవాణాకు పాల్పడిన ఆరుగురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు సీపీఓ వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న మంగంపేట ఏపీఎండీసీ శాఖలో బెరైటీస్ ఖనిజం అక్రమంగా తరలించారని ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు. దీనిపై విజయవాడ ఏపీఎండీసీ డిప్యూటీ జీఎం సుదర్శన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రమాన్‌లతో కమిటీ వేయగా అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఐదుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఒక పర్మినెంట్ ఉద్యోగిని తొలగించారు.

దేవా.. దీవించవా..

- ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తులు


ఇరుముడి సమర్పిస్తున్న స్వామి మాలధారులు


గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు


సుప్రభాత కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితులు


నరనంది వాహనోత్సవంలో విహరిస్తున్న స్వామి, అమ్మవారు

బ్రహ్మంగారిమఠం : 'దేవా.. దీవించవా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని కాపాడవయ్యా..' అంటూ భక్తులు వేడుకున్నారు. బ్రహ్మంగారిమఠంలో శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. మూడో రోజైన శనివారం తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బ్రహ్మంగారిమఠంలోని విరాట్ నగర్‌లో విజయవాడ వారు ఏర్పాటు చేసిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి నిత్య అన్నదాన విశ్వబ్రాహ్మణ సేవా సమాజం వారి కోరిక మేరకు ఉత్సవం నిర్వహించారు. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్ఠింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం మహా నైవేద్య పూజ కార్యక్రమాన్ని పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వర స్వామి పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి, కుటుంబ సభ్యులు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు.

వైభవంగా నరనంది ఉత్సవం

రాత్రి నరనంది ఉత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నరనంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్నమఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి బద్వేలు నియోజకవర్గం రామాపురంలోని నీరొద్దుల పాపయ్య కుమార్తె వెంకటమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు. రాత్రి మైదుకూరుకు చెందిన రమణయ్య ప్రదర్శించిన గజేంద్రమోక్షం హరికథ అందరినీ అలరించింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెలిసో, తెలియకో చేసిన తప్పులు వెంట్రుకలను ఆశ్రయించి ఉంటాయని ఆర్యోక్తి. అందుకే తమ తలనీలాలను స్వామికి సమర్పించుకుంటే తొలగుతాయని నమ్మకం. అందుకే కొందరు పూర్తిగా, మరి కొందరు మూడు కత్తెరల ద్వారా తలనీలాలు సమర్పిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన స్వామి మాలధారులు ఇరుముడి సమర్పించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవం విశిష్టత

ఎంతటి భక్తుడైనా స్వామి వారికి వాహనుడై తన భక్తిని చాటుకోవడం ఈ ఉత్సవం విశేషం. స్వామికి వాహనుడై మోసే భక్తిభావం చూపిస్తారు. అంతేగాక నంది ధర్మానికి సంకేతంగా, మానవుడు కూడా ధర్మబద్ధుడై తన జీవనం సాగించడానికి ప్రతీకగా జరిగే ఉత్సవం నరనంది ఉత్సవం. నరనంది అనగా ముఖం నరుడిగా, శరీరం నందిగా ఉండటం. నరుడు, నందితో కూడిన స్వరూపం.

భారీ బందోబస్తు

ఆరాధనోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మైదుకూరు డీఎస్పీ మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో మరో ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్ఐలు, 64 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 45 మంది మహిళా పోలీసులు, 120 మంది పోలీసులు, 103 మంది హోంగార్డులు మూడు రోజుల పాటు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కనుల పండువగా నిర్వహిస్తారు. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం సూక్త పారాయణం, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. కార్యక్రమాలకు ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటసుబ్రమాణ్యాచార్యులు ఆధ్వర్యం వహించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు.

జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు అరెస్ట్

కడప అర్బన్ : జీవీ ఫుట్‌బాల్ యాప్ కేసులో ఇద్దరు నిందితులను కడప వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలు వెల్లడించారు. జీవీ ఫుట్‌బాల్ యాప్‌లో పెట్టుబడి పెడితే, రోజూ కమీషన్‌తోపాటు కొన్ని రోజుల తర్వాత రెండింతలు సంపాదించవచ్చని ప్రజలకు కొందరు ఎరవేస్తున్నారు. దీని ద్వారా రోజూ వేలాది రూపాయల ఆదాయం వస్తుందంటూ జీవీ యాప్ ప్రచారానికి పాల్పడుతున్నారు. దీనిపై కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో చెన్నూరు మండలం రుద్రభారతిపేటకు చెందిన ముద్దల శేఖర్, చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెకు చెందిన బుక్కే ప్రతాప్‌నాయక్‌ను అరెస్ట్ చేశారు. ఇంకా దర్యాప్తు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ఇలాంటి బెట్టింగ్ యాప్‌లను నమ్మిమోసపోవద్దని చెప్పారు. ప్రజల దగ్గర ఏదైనా సమాచారం వుంటే పోలీసులకు తెలపాలని పేర్కొన్నారు. డయల్ 100కు లేదా జిల్లా పోలీసు కార్యాలయం వాట్సాప్ నంబర్: 91211 00704కు ఫిర్యాదు చేయాలన్నారు. పెట్టుబడుల పేరిట ఆదాయం వస్తుందని నమ్మించే యాప్‌ల పట్ల అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి బంధించిన యువకునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మదనపల్లి రూరల్ సీఐ సివాంజనేయులు మాట్లాడారు. ఈనెల 24వ తేదీన రామసముద్రంలోని గాజుల నగరంలో కాపురమున్న ఓ మైనర్ బాలికను కర్ణాటకలోని శ్రీనివాసపురం తాలూకా సోమయాజులపల్లెకు చెందిన నవీన్ కిడ్నాప్ చేశాడు. రామసముద్రంలో బాలిక ఇంటి పక్కన సెంట్రింగ్ పని చేస్తూ మాయమాటలు చెప్పి అతను నమ్మించాడు. ఈ క్రమంలో అమ్మాయిని కిడ్నాప్ చేసి శ్రీనివాసపురం చౌడనహళ్లిలో తన స్నేహితుని ఇంట్లో బంధించి ఉంచాడు. విషయం తెలుసుకున్న మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు, రూరల్ సీఐ సివాంజనేయులు సూచనలతో రామసముద్రం ఇన్‌చార్జి ఎస్సై రామక్రిష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అంత్యక్రియల్లో తేనెటీగల దాడి

30 మందికి పైగా గాయాలు


బి.కొత్తకోట : మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలు సాగుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో.. 30 మందికిపైగా గాయపడ్డారు. ఈ సంఘటన బి.కొత్తకోట మండలం శీలంవారిపల్లె పంచాయతీ గుడిపల్లెలో శనివారం జరిగింది. గుడిపల్లెకు చెందిన అధ్యాపకుడు రామిరెడ్డి (65) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం బెంగళూరులో మృతి చెందగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. సాయంత్రం నాలుగు గంటలు దాటాక అంత్యక్రియలు పూర్తి చేసేందుకు సమాధి వద్దకు తరలించే క్రమంలో టపాసులు పేల్చారు. పైకి ఎగసి పేలే టపాసుల పొగ సమీపంలోని చెట్లకు పాకింది. మృతదేహాన్ని సమాధి వద్దకు తీసుకొచ్చారు. ఆ సమయంలో 300 మందికిపైగా గ్రామస్తులు ఉన్నారు. మృతదేహాన్ని సమాధి గుంతవద్ద పెట్టగానే సమీపంలోని చెట్ల నుంచి తేనెటీగల గుంపు గ్రామస్తులపై దాడి చేసింది. ఈ హఠాత్పరిణామంతో మృతదేహాన్ని వదిలేసి భయంతో పరుగులు తీశారు. చెరువు, పొలాల వెంట పరుగు తీసినా తేనెటీగల దాడి ఆగలేదు. దాదాపుగా అందరిపైనా దాడి చేశాయి. వారిలో కురబలకోట మండలం తెట్టుకు చెందిన మంగమ్మ (60) తీవ్రంగా గాయపడటంతో మదనపల్లెలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతోంది. బి.కొత్తకోట, ములకలచెరువు, కురబలకోట, మదనపల్లె మండలాలకు చెందిన వెంకటరమణ, రాజేష్, రాందాసు, కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్.వెంకటరమణారెడ్డి, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, ఎస్.రెడ్డెప్ప, మరో 20 మందికిపైగా గాయపడ్డారు. వీరికి చెందిన మొబైల్‌ఫోన్లు, పర్సులు పోగొట్టుకున్నారు. కాగా సాయంత్రం ఆరుగంటలైనా తేనెటీగల గుంపు వెళ్లకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామస్తులు సాహసించలేదు. కొందరు దుప్పట్లు కప్పుకుని సమాధివద్దకు వెళ్లి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. సమాధి చేసేందుకు కొద్దిసేపు మట్టి పోయడం తర్వాత దూరం వెళ్లడం, మళ్లీ కొద్దిసేపు సమాధివద్దకు రావడం మట్టిపోయడం చేస్తూ రాత్రి ఎనిమిది గంటలకు అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ తేనెటీగల దాడితో అంత్యక్రియలకు వచ్చిన బంధువులు, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గాయపడిన బాధితులు బి.కొత్తకోట, మదనపల్లె, కనికలతోపు, అంగళ్లు, బురకాయలకోటల్లో వైద్యం చేయించుకున్నారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్య


మృతి చెందిన గణేష్

నిమ్మనపల్లె : అప్పుల బాధ తాళలేక భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్మనపల్లె పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు పత్తికొండ గణేష్ (35) భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాడు. భార్య రెడ్డిలక్ష్మి పశుపోషణతో కుటుంబానికి ఆసరాగా ఉంది. వీరికి నందిని (9), దీపిక (7), మనోజ్ (3) అనే పిల్లలు ఉన్నారు. అయితే గతంలో గణేష్ తనకు ఉన్న అర ఎకరా పొలంలో టమాట పంట సాగు చేశాడు. గిట్టుబాటు ధర లభించకపోవడంతో పూర్తిగా నష్టపోయాడు. పంట సాగుతోపాటు కుటుంబ పోషణ కోసం ఇతరత్రా అవసరాలకు పలువురి నుంచి భారీగా అప్పులు చేశారు. అప్పులు అసలు, వడ్డీతో రూ.6 లక్షలకు చేరాయి. దీంతో ఇటీవల కొంతకాలంగా రుణదాతల నుంచి ఒత్తిడులు పెరిగాయి. ఇంటి వద్దకు వచ్చి వారు నిలదీయడంతో భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి వివాదం ఏర్పడి గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ గ్రామ సమీపంలోని చింతచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే గమనించిన స్థానికులు బాధితున్ని ఉరి నుంచి తొలగించి హుటాహుటిన నిమ్మనపల్లె పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు మదనపల్లెకు రెఫర్ చేయగా 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున బాధితుడు మృతి చెందాడు. నిమ్మనపల్లె పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యుల నుంచి సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం ఏర్పడి, భార్యా పిల్లలు అనాథలయ్యారు.

ఉమ్మడి జిల్లా బస్‌పాస్ సౌకర్యం కల్పనకు కృషి


ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

రాజంపేట : కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లాల బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం మేడా భవన్‌లో ఎమ్మెల్యేను రాజంపేట జర్నలిస్టులు కలిసి కొత్త అక్రిడేషన్లు మంజూరు కానున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సు పాస్‌ను జిల్లాకే పరిమితం చేయకుండా ఉభయ జిల్లాలకు వర్తించేలా ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్న జర్నలిస్టులకు జిల్లా వరకే బస్‌పాస్ ఇవ్వడం వల్ల అనేక రకమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వివిధ పత్రికల ప్రింటింగ్ యూనిట్ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయాలు వైఎస్సార్ జిల్లా కేంద్రంలోనే ఉన్నాయన్నారు. అటువంటప్పుడు అన్నమయ జిల్లా వరకే పాసు ఇవ్వడం సముచితం కాదన్నారు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, దీన్ని దృష్టిలో వుంచుకొని ఉభయ జిల్లాల బస్‌పాసును ఇవ్వాలని స్వయంగా రాష్ట్రమంత్రిని జర్నలిస్టుల తరపున కలిసి కోరుతామన్నారు. అలాగే పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజంపేటలో ఆర్టీసీ బస్‌పాస్ (జర్నల్)కు ఇచ్చేలా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టరును కోరానన్నారు. కార్యక్రమంలో రాజంపేట సీనియర్ జర్నలిస్టులు, వివిధ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు పాల్గొన్నారు.

లోయలో పడిన సిమెంటు లారీ

– డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

రామాపురం: చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డుపై శనివారం సిమెంటు లారీ లోయలోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మాచర్ల నుంచి బెంగళూరుకు సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ గువ్వలచెరువు ఘాట్ రోడ్డులోని రెండవ మలుపువద్ద అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేష్(42) లారీలో ఇరుక్కోవడంతో రెండు కాళ్లు విరిగినట్లు తెలిసింది. వెంటనే పోలీసులు, హైవే సిబ్బంది తాళ్ల సహాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన లక్ష్మీప్రసన్న

నందలూరు(రాజంపేట) : నందలూరుకు చెందిన లక్ష్మీప్రసన్న (22) అనే వివాహిత మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న 2021 అక్టోబర్‌లో నందలూరులో ఉండే సాయిమదన్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. శనివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. తమ కుమార్తెను డబ్బు కోసం వేధింపులకు గురిచేసి అత్త, భర్త చంపారని మృతురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు.

మృతదేహాన్ని పరిశీలించిన డీఎస్పీ

నందలూరు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న లక్ష్మీప్రసన్న మృత దేహాన్ని రాజంపేట డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈయన వెంట సీఐ పుల్లయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు, ఉన్నారు. తహసీల్దార్ ఉదయ శంకర్ పరిశీలించి శవపంచనామా చేయించారు.

ఫ్లాష్..ఫ్లాష్..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాదంలో మృతి చెందిన ప్రణీత్

సంబేపల్లె : మండలంలోని చిత్తూరు -కర్నూలు జాతీయరహదారిలోని ఎర్రగుంట్ల సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా.. మరోవ్యక్తికి గాయా లయ్యాయి. వివరాల్లోకి వెళితే... రాయచోటి బోస్ నగర్‌కు చెందిన పాళెం ప్రణీత్ (21), ఇందిరమ్మ కాలనీకి చెందిన రవి కుమార్ ఇద్దరూ ద్విచక్రవాహనంపై సంబేపల్లె వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనున్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రణీత్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ రవికుమార్‌ను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు.